తిరుపతి జిల్లా అభివృద్ధికి బంగారు బాటలు

- కృష్ణపట్నం పోర్టు, క్రిస్ సిటీలను కలుపుతూ ప్రధాన రోడ్లు
- రోడ్డు, మౌలిక సదుపాయాల కోసం రూ. 2872 కోట్లు
- ఈ డిసెంబరుకు పూర్తి కానున్న పనులు

కృష్ణపట్నం కేంద్రంగా పరిశ్రమల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ప్రణాళికలు తిరుపతి జిల్లాకు బంగారు బాటలు పరవనున్నాయి. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, బెంగళూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, సాగరమాల, భారత్‌మాల, కోస్టల్ కారిడార్.... ఇలా ప్రతిదీ కృష్ణపట్నంతో అనుసంధానం అవుతున్నాయి. కృష్ణపట్నం పోర్టును ఆధారంగా చేసుకునే ఇండస్ట్రియల్ నోడ్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 25 కిలోమీటర్ల సమీపంలో వైజాగ్-చెన్నై ఎన్‌హెచ్-16 నాలుగులేన్ల రహదారి ఉండడం, 15 కిలోమీటర్ల దూరంలోనే కృష్ణపట్నం రైల్వే స్టేషన్ ఉండడం, 90 కిలోమీటర్ల దూరంలో తిరుపతి ఎయిర్‌పోర్టు ఉండడం, చెన్నై ఎయిర్ పోర్టు కూడా 150 కిలోమీటర్ల చేరువలో ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి సోపానాలు అయ్యాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన శ్రీసిటీ, మేనకూరు సెజ్, కొత్తగా పురుడు పోసుకుంటున్న క్రిస్‌సిటీలను కలుపుతూ అద్భుతమైన రహదారులు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి తిరుపతి జిల్లా రూపురేఖలను మార్చబోతున్నాయి. రూ. 2872 కోట్లతో పనులు పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రోడ్లు, మౌలిక సదుపాయాల పనులు పూర్తయితే కృష్ణపట్నం నోడ్ పేరిట ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు సైతం వేగవంతం అవుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



భారత్‌మాల ప్యాకేజీ 3: ఈ ప్యాకేజీలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టు పురోగతిలో వుంది. తమ్మినపట్నం వద్ద కృష్ణపట్నం పోర్టు నుంచీ (కండలేరు క్రీక్ నార్త్ అండ్ సౌత్ ఇండస్ట్రియల్ క్లస్టర్) మొల్లూరు వరకూ కనెక్ట్ చేయడానికి ఆరు వరుసల రోడ్డును 15.95 కిలోమీటర్ల మేరకు పొడిగించే పనులు జరుగుతున్నాయి. రూ. 609.43 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను ఏఎంఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సంస్థ 2023 సెప్టెంబరు 25న ప్రారంభించింది. ఈ ఏడాది సెప్టెంబరుకల్లా పనులు పూర్తయ్యే అవకాశముంది.



కృష్ణపట్నం పోర్టు నుంచి మొల్లూరుకు నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు



నాయుడుపేట మండలం అన్నమేడు వద్ద (నాయుడుపేట-తూర్పుకనుపూరు మధ్య) సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు

సాగరమాల ప్యాకేజీ 4 : నాయుడుపేట నుంచీ తూర్పు కనుపూరు వరకు 34.88 కిలోమీటర్ల పొడవైన సిక్స్ లేన్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆప్కో ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 1398.84 కోట్ల అంచనాతో 2023 డిసెంబరు 20న పనులు మొదలు పెట్టింది. ఈ ఏడాది అక్టోబరుకల్లా పనులు పూర్తి కానున్నాయి.



బల్లవోలు (కాకువారిపాలెం నుంచి వరగలి వరకు) వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

క్రిస్ సిటీకి అనుసంధానం

క్రిస్ సిటీకి ఎక్స్‌టర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టు కింద పలు పనులు జరుగుతున్నాయి. బల్లవోలు దగ్గర కాకువారిపాలెం నుంచీ వరగలి వరకూ ఇపుడున్న లింక్ రోడ్డును 17 కిలోమీటర్ల మేరకు విస్తరిస్తున్నారు. ఈ లింక్ రోడ్డు ఫోర్ లేన్ రోడ్డును కలుపుతుంది.

అలాగే భారత్‌మాల కింద ఎన్‌హెచ్‌లో (ప్యాకేజీ 2, పార్ట్ 2) నాయుడుపేటను, కృష్ణపట్నం పోర్టును కలిపే మేజర్ బ్రిడ్జి -1 వద్ద చివరి మైలు కనెక్ట్ చేసే పని జరుగుతోంది. అదే ఎన్‌హెచ్‌లో మేజర్ బ్రిడ్జి-2 వద్ద చివరి మైలును కనెక్ట్ చేసే పని జరుగుతోంది. ఇవన్నీ కూడా ఈ ఏడాది సెప్టెంబరు నుంచీ డిసెంబరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలతో వ్యవహరిస్తోంది. అందులో భాగంగా పనుల పురోగతిని పూర్తిస్థాయిలో సమీక్షించింది. త్వరగా పనులు పూర్తి చేయాలంటూ సంబంధిత కాంట్రాక్టు సంస్థలను, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల వెంట జిల్లా అధికారులు పడుతున్నారు.

భారత్ మాల ప్యాకేజీ-2 పార్ట్- 1: ఈ ప్యాకేజీలో భాగంగా ఎన్‌హెచ్ 16 చిల్లకూరు క్రాస్ రోడ్డు నుంచీ తూర్పు కనుపూరు వరకూ 24.92 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దానితో పాటు ఫ్లైఓవర్, అప్రోచ్ రోడ్డుల పనులు కూడా చేపట్టారు.



చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు నిర్మాణంలో ఉన్న ఫోర్ లేన్ రోడ్డు



చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఫ్లై ఓవర్ పనులు

భారత్ మాల ప్యాకేజీ-2 పార్ట్ -2: దీని కింద తూర్పు కనుపూరు నుంచీ కృష్ణపట్నం పోర్ట్ దక్షిణ గేట్ వరకూ 11.24 కిలోమీటర్ల మేరకు సిక్స్ లేన్ రోడ్డు పనులు సాగుతున్నాయి. రూ. 864.24 కోట్ల అంచనాతో ఈ పనులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ 2023 డిసెంబరు 17న చేపట్టింది. ఈ ఏడాది డిసెంబరుకల్లా పనులు పూర్తి కానున్నాయి.



తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం దక్షిణం గేటు వరకు జరుగుతున్న సిక్స్ లేన్ రోడ్డు పనులు



నాయుడుపేట-కృష్ణపట్నం పోర్టులను కలిపే మేజర్ బ్రిడ్జి-1 అన్నమేడు గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న దృశ్యం



కోట మండలం విద్యానగర్ సమీపంలో నాయుడుపేట- కృష్ణపట్నం పోర్టులను కలిపే మేజర్ బ్రిడ్జి-2 నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

అయ్యో.. ఎంత ఘోరం

- ఐదంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీ మేస్త్రీల దుర్మరణం
- తిరుపతిలో పూత పనిచేస్తుండగా ఘటన
- మృతుల్లో బావ, బామ్మర్ది





మృతులు బి.శ్రీనివాసులు, వసంత్, కె.శ్రీనివాసులు



ఐదంతస్తుల భవనంపై నుంచి పడి మృతిచెందిన తాపీ మేస్త్రీలు



భర్త బి.శ్రీనివాసులు మృతదేహాన్ని చూసి విలపిస్తున్న ప్రమీల

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదంతస్తుల ఇంటికి పూత వేసేందుకు కట్టిన సారవ తాడు ఊడిపోవడంతో విషాదం చోటుచేసుకుంది. సుమారు 50 అడుగులకు పైనుంచి కింద పడి ముగ్గురు మేస్త్రీలు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం తిరుపతి రూరల్ తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో జరిగింది. ఇక్కడి హెచ్‌ఐజీలో ఏడాదిగా ఐదంతస్తుల ఇల్లు కడుతున్నారు. ఆ ఇంటి బయట గోడలకు మంగళవారం పూతపని మొదలు పెట్టారు. దీనికోసం కింద నుంచి పై అంతస్తు వరకు కొయ్యలతో సారవ కట్టారు. ఈ సారవపై నిలబడి గోడకు పూత పని చేస్తుండగా ఉదయం 10.40గంటల సమయంలో అడ్డసారవ కొయ్యలకు కట్టిన తాడు ఊడిపోయింది. మిగతా కొయ్యలు అటు ఇటు కదలడంతో వాటిపై నిలబడివున్న తాపీ మేస్త్రీలు.. పెళ్లకూరు మండలం అక్కగారిపేటకు చెందిన బి.శ్రీనివాసులు, జీవనోపాధి నిమిత్తం ఒంగోలు నుంచి పదేళ్ల కిందట శ్రీకాళహస్తికి వచ్చి స్థిరపడిన కె.శ్రీనివాసులు, అతడి బావమరిది టి.వసంత్ అదుపుతప్పి పడిపోయారు. సారవకొయ్యలకు, గోడకు కొట్టుకుంటూ కింద పడటంతో ఇద్దరు దుర్మరణం చెందారు. 108 అంబులెన్స్‌ను రప్పించే లోపే మరొకరు తుదిశ్వాస విడిచారు. కావలికి చెందిన మరో మేస్త్రీ మాధవ ఓ చేతితో అడ్డకర్రను పట్టుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులకు, పంచాయతీ అధికారులకు ఇంటి యజమాని సమాచారమిచ్చారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుచానూరు డీఎస్పీ బి.ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐలు బాలకృష్ణారెడ్డి, సాయినాథ్‌చౌదరి, అరుణకుమారి, తహసీల్దారు భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఉద్యోగులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ఇంటి యజమాని స్రవంతి, ఆమె మామ, విశ్రాంత ఉపాధ్యాయుడు కడివేటి ఆండాలయ్య, సారవకు తాళ్లు కట్టిన ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.



కొడుకు వసంత్, అల్లుడు శ్రీనివాసులు మృతితో విషాదంలో రమణమ్మ

మేమెలా బతకాలి?

మృతుల కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో శ్రీకాళహస్తి నుంచి వాళ్లంతా వచ్చారు. భర్త బి.శ్రీనివాసులు మృతదేహం వద్ద ప్రమీల, కుమారుడు వసంత్, అల్లుడు కె.శ్రీనివాసులు మృతదేహాలను చూసి బ్రహ్మయ్య, రమణమ్మ కన్నీరుమున్నీరయ్యారు. 'మిమ్మల్ని పోగొట్టుకున్న మేము ఎలా బతకాలి? పిల్లలు ఏమైపోవాలి? మా పరిస్థితి ఏంటి' అంటూ తలబాదుకున్నారు. ఆ ప్రాంతమంతా విషాదం నెలకొంది.

అనుమతి లేకనే పై అంతస్తుల నిర్మాణమా?


ఈ ప్రాంతంలో జీ ప్లస్ త్రీ వరకే నిర్మాణానికి అవకాశం ఉంది. కానీ ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నారంటే.. పై అంత్తులకు అనుమతి తీసుకోలేదా? అనుమతి లేకుండా అంత ఎత్తున భవనం నిర్మిస్తుంటే పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నట్లు? ఇదీ స్థానికంగా వ్యక్తమవుతున్న ప్రశ్నలు. ఈ క్రమంలో ఐదంతస్తులకు అనుమతులున్నాయా లేవా అనేది విచారిస్తామని ఏఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది దర్యాప్తులో పరిశీలిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఈవోపీఆర్డీకి షోకాజ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తుడా అప్రూవల్ మూడు అంతస్తుల వరకే ఉంది. కానీ ఐదంతస్తులకుపైగా నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోలేదు. ఇలా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈవోపీఆర్డీ మాధురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ భవన నిర్మాణంతో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవన యజమానికి కార్మిక నష్టపరిహారం చట్టం కింద కార్మిక శాఖ అధికారులు నోటీసులు అందించారని, మృతుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

దారం ఊడిపోవడంతోనే ఘటన



'సారవకు కట్టిన తాళ్లు ఊడిపోవడంతో ప్రమాదం జరిగింది. జీ ప్లస్ త్రీ భవన నిర్మాణానికి అనుమతులున్నాయి. మరో రెండు అదనంగా వేశాం' అంటూ కె.ఆండాలయ్య తెలిపారు.

అంతా క్షణాల్లోనే..



ఐదో అంతస్తు వద్ద గోడకు పూత పని చేస్తుండగా అడ్డసారవకు కట్టిన దారాలు ఊడిపోయాయి. దాంతో ముగ్గురు మేస్త్రీలు కిందపడి చనిపోయారు. నేను ఓ చేత్తో కొయ్యను పట్టుకొని ఉండడంతో మృత్యువు నుంచి బయటపడ్డా. అంతా క్షణాల్లోనే, విషాదం చోటుచేసుకుంది.

- మాధవ, తాపీ మేస్త్రి

డాడీకి ఏమైందమ్మా?

పెళ్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం అక్కగారిపేట ఎస్సీ కాలనీకి చెందిన బుడతోటి శ్రీనివాసులు (38)కు భార్య ప్రమీల, కొడుకు వరుణ్‌తేజ, కుమార్తె రోషిణి ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారాయన. తిరుపతిలో పూత పని చేస్తుండగా మంగళవారం నాటి ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. భర్త మృతితో విలపిస్తున్న ప్రమీలను చూసి.. 'డాడీకి ఏమైందమ్మా' అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నారులను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.



శ్రీనివాసులు (ఫైల్ ఫోటో)

అదిగదిగో గజరాజులు!

- అడవుల్లో ఏనుగుల జాడ కనిపెట్టేందుకు డ్రోన్ల వినియోగం




ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఏనుగులు ఎక్కడ తిష్ట వేశాయి. ఎన్ని ఉన్నాయి? ముందుకు వస్తున్నాయా, అడవిలోకి వెళ్తున్నాయా? అని డ్రోన్లసాయంతో గజరాజుల జాడ తెలుసుకునేలా అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఈ వివరాల ఆధారంగా ట్రాకర్ల ద్వారా ఏనుగులను దారి మళ్లించడంతో పాటు సమీప ప్రజలను అప్రమత్తం చేస్తారు. శేషాచల అడవుల్లో నుంచి ఏనుగులు వేసవి రాగానే పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. ట్రాకర్లతోను, రైతులూ దండుగా వెళ్ళి అరచి, క్రాకర్స్ పేల్చి బెదిరిస్తే గతంలో ఏనుగులు అడవిలోకి వెళ్లేవి. ఇప్పుడు తిరగబడుతున్నాయి. తాజాగా ఓ రైతును తొక్కి చంపాయి. ఈ క్రమంలో ఏనుగుల జాడ పసిగట్టి.. వాటిని కట్టడి చేసేందుకు రూ.2.5 లక్షలతో అటవీశాఖ డ్రోన్‌ను కొనుగోలు చేసింది. అర కిలోమీటరు ఎత్తులో ఎగురుతూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఏనుగుల కదలికలు, పొదల్లో నక్కి ఉన్నా లైవ్ విజువల్ పంపుతుంది. అడవుల్లోకి ఏనుగులను తరుముతున్నప్పుడు (డ్రైవ్) ముందుకే పోతున్నాయా? ఎదురు తిరుగుతున్నాయా? నెమ్మదిగా పోతున్నాయా? ఆ గుంపులో గున్నలు ఉన్నాయా అనేది తెలుసుకుని సులభంగా డ్రైవ్ చేయొచ్చని అధికారులు అంటున్నారు. భాకరాపేట రేంజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ డ్రోన్‌ను తొలిసారిగా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీలోని పొలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తలకోన సౌత్ బీట్ పరిధిలో ఏనుగుల కదలికలను ఈ డ్రోన్ సాయంతో గుర్తించి అక్కడి రైతులను అప్రమత్తం చేశారు.

ఉపాధి నిధుల స్వాహాపై విచారణ


కూలీలను విచారిస్తున్న అధికారులు

చంద్రగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అగరాల పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి అధికారులను కోరారు. 2023-24లో పంచాయతీలో రూ.4.16 లక్షల ఉపాధి నిధుల స్వాహా పై సర్పంచ్ ఆధారాలతో పాటు ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం ఏపీడీ రెడ్డప్ప, ఎంపీడీవో వెంకటరత్నం ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 36 మంది పనులు చేయకపోయినా వారి పేర్లతో నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. కూలీలు తిరిగి నగదు తిరిగి చెల్లించాలన్నారు. దీనిపై కూలీలు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పనులు చేయకపోయినా అకౌంట్లల్లో పడిన నగదు డ్రా చేసి తీసుకున్నారన్నారు. ఈక్రమంలో 36 మందినీ విచారించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీవోలు జ్యోతి, భార్గవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడికి సన్మానం



చంద్రగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన పల్లినేని సుబ్రమణ్యంనాయుడిని మంగళవారం మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. చంద్రగిరిలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను మండలంలోని సన్మానించారు. ఈసందర్భంగా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు తనపై చూసిన ఆదరాభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్‌రాయల్, బాలకృష్ణమూర్తి, తులసేశ్వరరెడ్డి, రాజులగారి వినోద్, విశ్వనాథం, మేడసాని కుమార్, లోకేష్, ధనంజయరెడ్డి, లోకాద్రి, గాలి సతీష్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొలాలపై కొనసాగుతున్న గజదాడులు


ఏనుగులు ధ్వంసం చేసిన వరిపంట

పాకాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజులుగా ఏనుగులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం రాత్రి ఎంటపొలాలపై విరుచుకుపడ్డాయి. చిన్నపాపయ్యగారిపల్లెకు సమీపంలో రైతు మోహన్ సాగుచేసిన మామిడి, పశుగ్రాసం, కొబ్బరిచెట్లు, సోమశేఖర్ సాగుచేసిన వరిపంట, శివయ్య పొలంలోని చెరకు తోటను ధ్వంసం చేశాయి. పి.శివకుమారి చెరకుతోట కొబ్బరిచెట్లు, పైపు లైన్‌లు ధ్వంసం చేశాయి.

12వ పీఆర్సీ ప్రకటించి ఐఆర్ ఇవ్వాలి: బీటీఏ

పాకాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ ప్రకటించి, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని బీటీఏ జాతీయ ఉపాధ్యక్షులు జి.ఆంజినేయులు కోరారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో ఆదివారం బీటీఏ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఆంజినేయులు మాట్లాడుతూ జూలై 23 నుండి పీఆర్సీ అమలు కావలసి వున్నా ఇప్పటివరకు కమిటీ వేయకుండా ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి స్పందించి హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి, నాయకులు జ్యోతిప్రసాద్, శివప్రసాద్, విజయమోమన్, కెఎన్ తులసీరామన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నృత్య దినోత్సవం



తిరుచానూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో మంగళవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్నిపురస్కరించుకుని కూచిపూడి, భరతనాట్యప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఇందులో పది నృత్యఅకాడమీలకు చెందిన కళాకారులు త్యాగరాజ కృతులకు, అన్నమాచార్య కీర్తనలకు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు చేశారు. వీరిని ఏవో సుధాకర్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

అప్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తేజస్వినిరెడ్డి


తేజస్విని సన్మానిస్తున్న పలువురు నాయకులు

తిరుచానూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుచానూరులోని శ్రీఎన్నార్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.తెజస్విని రెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలోజరిగిన అప్సా రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆమెను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తేజస్వినిరెడ్డి మాట్లాడుతూ అప్సా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆమెను పలువురు ఘనంగా సన్మానించారు.

వరిపంటను ధ్వంసం చేసిన పందుల గుంపు


మల్లెలవాండ్ల పల్లెలో ధ్వంసమైన వరిపంట

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ చిట్టిచెర్ల పంచాయతీలో మంగళవారం వేకువజామున పందుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేశాయి. మల్లెల వాండ్ల పల్లెలో ఓ రైతుకు చెందిన వరి పంటను తినేశాయి. ఏనుగుల దాడితో భయపడుతుంటే పందులు, దుప్పులు కూడా పంటలను తినేస్తున్నాయి. ఏనుగు దాడిలో 20 శాతమే నష్ట పరిహారం రైతులకు అందుతోంది. పందులు,దుప్పులు, జింకలు దాడుల్లో పంట నష్ట పరిహారం అందిన దాఖలు లేవు. వరి, వేరుశనగ పంటలకు పరిహారం చెలించినది లేదు.

మెట్టప్రాంతాల్లో వర్షపునీటి సంరక్షణకు చర్యలు

తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో వర్షపునీటిని సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య కోరారు. వాగులు, వంకల్లో పూడికలు తీస్తే వర్షపు నీరు సులభంగా చెరువులోకి చేరుతుందన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెట్ట రైతులు పొలంలో వాలును బట్టి వర్షపు నీరు చేరే పల్లపు ప్రాంతాల్లో చిన్నపాటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రధాన పంటలు, అంతర పంటలను వాలుకు అడ్డంగా వరుసల్లో వేసుకుంటే పల్లపు ప్రాంతాలకు వెళ్లే వర్షపునీటి వేగం తగ్గి భూమిలోకి ఇంకుతుందన్నారు. ఫలితంగా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వర్షాన్ని పొలంలోనే ఇంకేలా చేసేందుకు సిద్ధం కావాలని కోరారు.

గంగమ్మతల్లికి అంబలి నైవేద్యం



తిరుపతిరూరల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలో గంగమ్మతల్లికి మంగళవారం అంబలి నైవేద్యంగా పెట్టి మొక్కు చెల్లించారు. గంగమ్మతల్లి జాతరను పురస్కరించుకుని ఏటా మూడు మంగళవారాలు అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కు చెల్లించడం ఆనవాయితీ. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీకృష్ణదేవరాయులు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ ఉన్నారు.

ప్రాంగణ నియామకాలకు 65మంది ఎంపిక

తిరుపతి రూరల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ కళాశాలలో ఏపీతోపాటు తమిళనాడు, బెంగళూరు, ముంబైకి చెందిన పలుసంస్థల ఆధ్వర్యంలో నాలుగురోజులపాటు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలు సోమవారం ముగిశాయి. డెయిరీ, పౌల్ట్రీ, పెట్ క్లినిక్స్, అంబులేటరీ క్లినిక్స్, మీట్ సంస్థల ఉద్యోగాలకు 65మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. విద్యార్థులను ఏడీతోపాటు ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె.సుధీర్, అధ్యాపకులు అభినందించారు.

అవిలాల గంగమ్మ జాతర చాటింపు

తిరుపతి రూరల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): అవిలాల గ్రామంలో గంగమ్మతల్లి జాతరని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గ్రామంలో చాటింపు వేశారు. ఈక్రమంలో నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి

రేణిగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఏర్పేడు రైల్వే గేటు వద్ద మంగళవారం జరిగింది. జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపిన వివరాలు... బాలకృష్ణాపురం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిపడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని, తిరుపతి వైపుకు వెళ్లే రైలు నుంచి జారి పడి ఉంటాడని భావిస్తు న్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పాలిసెట్

సత్యవేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించే పాలిసెట్ ఈనెల 30న బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. పాలిటెక్నిక్‌తో పాటు స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఉంటే పరీక్షా కేంద్రంలో ముందుగానే సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఏరేజర్, షార్ప్‌నర్ తీసు కురావాలని సూచించారు. బాలికల గురుకుల పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నెం.4141001 నుంచి 4141150 వరకు, పాలిటెక్నిక్ కేంద్రంలో నెం.4151001 నుంచి 4151150 వరకు కేటాయించినట్లు తెలిపారు.

చెరువులో యువకుడి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతదాసు పల్లి చెరువులో మంగళవారం ఓ యువకుడి మృతదేహం నీటిపై తేలియాడు తుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలంలోని సంతదాసుపల్లి గ్రామా నికి చెందిన ప్రశాంత్(31) తండ్రి మృతి చెందడంతో కొంతకాలంగా గూడూ రులోని వామలమిట్ట ప్రాంతంలో తల్లి సుజాతమ్మతో కలిసి నివాసముంటు న్నాడు. ఓ ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్న ప్రశాంత్ ఈనెల 26వ తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మంగళవారం సంతదాసుపల్లి చెరువులో ప్రశాంత్ మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు



కుంట్రపాకం, తనపల్లె పంచాయతీల్లో నిర్మించిన నీటి తొట్టెలు

- 63 నీటితొట్టెల మంజూరు
- ఇప్పటికే 50 నిర్మాణాలు పూర్తి

తిరుపతి రూరల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవతీసుకుంది. పల్లెపండుగ పేరిట పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నీటితొట్టెల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రూరల్ మండలంలో ఎమ్మెల్యే పులివర్తినాని చొరవతో 22పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులు రూ.20.16లక్షల అంచనాతో 63తొట్టెలను మంజూరు చేశారు. ఇప్పటికే 50 నీటితొట్టెల నిర్మాణాలు పూర్తయ్యాయి..మరో ఐదుతొట్టెలకి సంబంధించిన పనులు సాగుతున్నాయి. ఆయా పంచాయతీలో పశువులు, గొర్రెలు, మేకలు మేతకు వెళ్లే ప్రాంతాలను గుర్తించి సిమెంటుతో ఈనీటితొట్టెలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలోనూ మూగజీవాలు మేతకు వెళ్లే ప్రాంతాలను గుర్తించి సిమెంటుతో ఈతొట్టెలను ఏర్పాటు చేసింది. కానీ గత వైసీపీ హయాంలో వీటి గురించి పట్టించుకోలేదు. రూరల్ మండలంలోని దాదాపు 70శాతానికిపైగా రైతులు పాడిపరిశ్రమపై ఆధారపడ్డారు. వీరంతా నీటితొట్టెల ఏర్పాటుపై సంతోషం వ్యక్తపరుస్తున్నారు. 63తొట్టెలు మంజూరు చేయగా 50తొట్టెల నిర్మాణాలు పూర్తి చేసినట్లు ఏపీవో జ్యోతిశ్రీ తెలిపారు. 4తొట్టెల నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. తుమ్మలగుంట, అవిలాల, చెర్లోపల్లెలో కూడా త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

గురుమూర్తి మృతి ఘటనలో 13మందిపై కేసు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని ద్వారకాపురం వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను మినీ వ్యాన్ ఢీకొనడంతో ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురుమూర్తి మృతిచెందిన విషయం తెలిసిందే. తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేశారని మృతుడి కుమారుడు గురుతేజ మంగళవారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగి కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మృతుడు గురుమూర్తి అదే గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటర్ సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి బయలు దేరారు. విషయం తెలుసుకున్న గురుమూర్తి ప్రత్యర్థులు మినీవ్యాన్‌లో నాయుడుపేట నుంచి వెంబడించి ద్వారకాపురం వద్ద మోటర్ సైకిల్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వాహనంలోని ఇద్దరు వ్యక్తులను మరో వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తిరుపతి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. గురుమూర్తి బైక్‌ను ఢీకొన్న మినీవ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎస్పీ ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ఇటీవల అత్తివరంలో పరిశ్రమలు నెలకొల్పడంతో కాంట్రాక్ట్ పనుల విషయమై తలెత్తిన విభేదాలే హత్యకు కారణమని సమాచారం.

లేగ దూడలకు అందాల పోటీలు

చిల్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిపేడు గ్రామంలో మంగళవారం నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించామన్నారు. లేగ దూడలను ఆరోగ్యంగా పోషిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే అధిక లాభాలను పొంద వచ్చునన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై పలు పథకాలను అంద జేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దూడలకు డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. అందాల పోటీల్లో విజేతగా నిలిచిన దూడల యజమానులతో పాటు పోటీల్లో పాల్గొన్న పాడి రైతులకు బహుమ తులు అందజేశారు.

ప్రశాంత వాతావరణంలో పోలేరమ్మ జాతర: విజయశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలరమ్మ జాతరను అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. జాతర నిర్వహణపై మంగళవారం నాయుడుపేట ఆర్‌అండ్‌బీ గృహ ప్రాంగణంలో ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన పండుగలను తమ ఆధ్వర్యంలో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గ్రామదేవత పోలేరమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతర కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ ఉరుసు, ఏటి పండుగ, పక్షుల పండుగలు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి అధికారులు, నాయకులు సహకరించడం సంతోషించ దగ్గవిషయమన్నారు. అలాగే పోలేరమ్మ జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. దేవదాయ శాఖ ఈవో రవికృష్ణ మాట్లాడుతూ మే 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే జాతరలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అర్బన్ సీఐ బాబి, తహసీల్దార్ రాజేంద్ర, కమిషనర్ ఫజులుల్లా, విన్నమాల పెద్దకాపు అరవ భూమి శ్రీనివాసులురెడ్డి విద్యుత్ డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ శివశంకర్, నానబాల సుబ్బారావు, గంగాప్రసాద్, సుధీర్ రెడ్డి, పోట్లపూడి రాజేష్, రామారావు, చిరంజీవి, అంజయ్య, మైలారి రాజశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి


సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే లైన్లకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై ఆర్డీవోలు దృష్టి పెట్టాలన్నారు.

గొర్రెల కాపరిపై కళ్ళల్లో కారం చల్లి దాడి

10 గొర్రెలను అపహరించుకుపోయిన దుండగులు

చంద్రగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలో గొర్రెల కాపరిపై అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కళ్ళల్లో కారం చల్లి, దాడి చేసి జీవాలను చోరీ చేసిన ఘనట మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు తొండవాడకు చెందిన మురళి గ్రామ పొలిమేరల్లోని స్వర్ణముఖినది ఒడ్డున గొర్రెలు, మేకలు, పొట్టేళ్ళు దొడ్డి వేసుకుని కాపలా ఉన్నాడు. మంగళవారం దొడ్డి దగ్గర నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో సుమారు 10 మంది గుర్తు తెలియని దుండగులు వచ్చారు. అలికిడికి లేచిన మురళి కళ్ళల్లో వారు కారం చల్లి, కర్రతో దాడి చేశారు. మురళి కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకున్నారు. ఈలోగానే దుండగులు 10 గొర్రెలకు కాళ్ళు కట్టి చోరీ చేసి, పరారయ్యారు. మురళిని చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.


దుండగుల దాడిలో గాయపడిన మురళి

11నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 11 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. 11వ తేదీ ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి పెద్ద శేషవాహన సేవ నిర్వహిస్తారు. 12న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 13న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 14న కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 15న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహన సేవలుంటాయి. అలాగే 16వ తేది ఉదయం హనుమంతు వాహనం, రాత్రి గజ వాహనం, 17న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 19న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ అనంతరం స్వామివారికి కల్యాణోత్సవం, 19న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్య, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. మే 18వ తేది రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.1000 చెల్లించి గృహస్తులు పాల్గొనవచ్చు. గృహస్తులకు ఉత్తరీయం, రవిక, లడ్డూ, వడ, కుంకుమ ప్రసాదాలను అందిస్తారు. అలాగే టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బ్రహోత్సవాల జరిగే రోజుల్లో ఆధ్యాత్మిక భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

ప్రశాంతంగా జడ్పీ సమావేశం

● హాజరు కాని పలువురు ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. శాసనసభ్యుల్లో జీడీనెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు థామస్,ఎమ్మెల్యే మురళీమోహన్ మాత్రమే పాల్గొన్నారు. ముందుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు మాట్లాడుతూ సాధారణ నిధుల నుంచి సుమారు రూ.13 కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.25 కోట్లు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, తాగునీటి సౌకర్యానికి వెచ్చించినట్లు వివరించారు. సుమారు 89మందికి కారుణ్య నియమకాల ద్వారా ఉద్యోగం కల్పించామన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ కోరారు..2022లో పాల సముద్రం మండలం గంగమాంబాపురానికి మంజూరైన పీహెచ్‌సీని తిరుమలరాజపురానికి మార్చాలని కోరారు. తిరుమలరాజపురంలో ఆస్పత్రి ఉంటే ఉపయోగంగా ఉంటుందన్నారు.

గుడి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

నారాయణవనం మండలం వెంకటకృష్ణపాళ్యం పంచాయతీ సింగిరికోనలో ఓ చిన్న గుడికి రోడ్డు పేరుతో సుమారు 6.50 కోట్ల ప్రజాధనాన్ని తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ దుర్వినియోగం చేశారని నారాయణవనం జడ్పీటీసీ సుమన్ ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, జడ్పీటీసీ, సర్పంచ్‌కు కూడా తెలియకుండా అటవీశాఖకు చెందిన సుమారు 40 అడుగుల భూమిలో 4 కిలో మీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్లు వెచ్చించారని,ఇందుకోసం చెట్లు నరికి వేశారని,వాటిలో ఎర్రచందనం చెట్లు కూడా ఉన్నాయన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీల చెలగాటం

తమిళనాడులో ఆర్ఎంపీ వ్యవస్థను నిషేధించారని, దీంతో వారిలో చాలామంది తమిళనాడు సరిహద్దులోని కుప్పం నియోజకవర్గం చేరి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని కుప్పం జడ్పీటీసీ శరవణ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.సుమారు 360మంది ఆర్ఎంపీలు నియోజకవర్గ వ్యాప్తంగా క్లీనిక్కులను నిర్వహిస్తూ చేతగాని వైద్యంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులను పెంచుతున్నారన్నారు. కుప్పం మండలంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను బదిలీ చేయాలని కోరారు.. శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో శాంతిపురం మండలంలో 50 శాతం కంటే ఎక్కువ ఫెయిలయ్యారని, దీనికి కారకులు ఎవరని డీఈవోను ప్రశ్నించారు.డీఈవో వరలక్ష్మి స్పందిస్తూ.. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం పాసయ్యేలా చూస్తామన్నారు.సమావేశం తరువాత కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి కోసం ఒక టీం పనిచేస్తోందన్నారు.త్వరలో స్పెషలిస్ట్ టీంను తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని 100 శాతం సోలరైజేషన్ చేసేందుకు వెండర్లను గుర్తించామని చెప్పారు.

పసుపు అలంకరణలో గంగమ్మ కటాక్షం



పసుపు అలంకరణలో ఉన్న అమ్మవారు, ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాత

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతర ముందు మూడో మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చింది. ఉదయం అమ్మవారిని మేల్కొలిపి వివిధ సుగంధ ద్రవ్యాలతో అర్చకులు అభిషేకం చేశారు. అనంతరం పసుపుకొమ్ములతో అమ్మను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మూడోవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మకు పూజలు చేశారు. మే 6వ తేదీన మంగళవారం రోజున చాటింపుతో జాతర వైభవంగా ప్రారంభమవుతుంది.

జాతరను విజయవంతం చేయాలి

తిరుపతి గంగమ్మ జాతర ఆహ్వాన పత్రికను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి అందజేశారు. కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జాతరను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట ఆలయ ఈవో జయకుమార్, సిబ్బంది మురళీ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

గంగమ్మ ఆలయ నిర్మాణానికి తిరుపతికి చెందిన బుర్ర కౌసల్య రూ.1,00,101 విరాళాన్ని ఆలయ ఈవో జయకుమార్‌ను అందజేశారు.

గోశాలకు జంబో కూలర్ల వితరణ


టీటీడీ గోశాల అధికారులకు జంబోకూలర్లను అందచేస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా టీటీడీ గోశాలకు ఓ దాత రెండు జంబో కూలర్లను వితరణ చేశారు. హైదరాబాదుకు చెందిన రంగశ్రీ (టీటీడీ బోర్డు సభ్యురాలు) అధునాతనమైన రెండో జెంబో కూలర్‌ను తిరుపతికి చేర్చారు. వాటిని జనసేన నేత కిరణ్‌రాయల్ మంగళవారం గోశాల డిప్యూటీ డైరెక్టర్ ఉపేంద్రవర్మ, డాక్టర్ భువనలకు అందజేశారు. కాగా ఇప్పటికే కిరణ్‌రాయల్ రెండు జంబో కూలర్లను వితరణ చేయగా లేగదూడలకు వినియోగిస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం


నృత్య కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జతీస్ నృత్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నృత్య కళాకారులకు చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువు శైలజా రెడ్డి, రాజా, పద్మ, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైసీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పద్మావతిపురం వద్ద గల వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్కాస్‌ను రద్దుచేసి తమకు అనుకూలమైన ఏజెన్సీలకు దోచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. పభుత్వం తక్షణమే జీవో నెంబరు 802ను రద్దు చేయాలని, ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు.

యుగ్మలో సంస్కృత వర్శిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భారతదేశ విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రసంగించారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యుగ్మ పేరుతో ఈ సదస్సు నిర్వహించినట్లు వివరించారు. ఈ సమావేశాల్లో సంస్కృత విశ్వ విద్యాలయంలో జరుగుతున్న ఇన్నోవేటివ్ కార్యక్రమాలను వీసీ వివరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీసీతో పాటు అకడమిక్ డీన్ ఆచార్య రజనీకాంత్ శుక్ల, రమశ్రీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ మేరకు వర్శిటీ ఒక ప్రకటన విడుదల చేసింది.

ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ సేవలకు అవార్డులు


ఎన్ఎస్ఎస్ ఉత్తమ సేవ అవార్డులు అందుకున్న అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన కో-ఆర్డినేటర్లు, వలంటీర్లకు మంగళవారం విశ్వవిద్యాలయంలో అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. ప్రోగ్రామ్ ఆఫీసర్లకు, యూనిట్ ఆఫీసర్లకు, వలంటీర్లకు రిజిస్ట్రార్ రజనీ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య పి.విజయలక్ష్మి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గంగా భవాని, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య మల్లికార్జున, వివిధ విభాగాల ఆచార్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు. .

నేటి నుంచి రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో ఈ నెల 30 నుంచి మే 2వ తేదీ వరకు రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి.

బదిలీ చేయిస్తానని రూ.5లక్షలు స్వాహా

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బదిలీ చేయిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన కుమారి గతంలో రుయా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసింది. గత ప్రభుత్వంలో ఆమెను కడప రిమ్స్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో రామచంద్రాపురం మండలం పరమాలకు చెందిన చెంగల్రాయులు తనకు ఆరోగ్యశాఖలో బాగా తెలిసిన అధికారులు ఉన్నారని రూ.5 లక్షలు ఇస్తే ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని నమ్మించి నగదు తీసుకున్నాడు. అయితే బదిలీ కాలేదు. దీంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె కోరింది. అతడి నుంచి సమాధానం రాకపోవడంతో మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ద్విచక్ర వాహనం చోరీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అలిపిరి పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అజిత కథనం మేరకు.. స్థానిక రాఘవేంద్రనగర్‌కు చెందిన రవీంద్ర పార్శిల్ కార్యాలయంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు పది రోజుల క్రితం ఇస్కాన్ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం ఉంచి పనిమీద వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూడగా వాహనం లేదు. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


ఆరాధన మృతదేహం

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మ హత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం తిరుపతిలో చోటు చేసుకుంది. యూని వర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు.. కుప్పం మండలం బంగారునత్తానికి చెందిన జగదీష్ కుమార్తె ఆరాధన (21). ఈమె మారుతీ నగర్ వద్ద వున్న పీజీ హాస్టల్లో ఉంటూ పద్మావతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం హాస్టల్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు.

ప్రేమపేరుతో మోసం.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన వ్యక్తిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సరస్వతి కథనం మేరకు.. స్థానిక కెనడీనగర్‌కు చెందిన ఎన్వీ లక్ష్మి రేణిగుంట రోడ్డులోని ఒక ప్రైవేటు హౌసింగ్ కంపెనీలో పనిచేస్తోంది. ఈమెకు ఇటీవల గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన వడివేలుతో పరిచయమైంది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో వడివేలు మరొకరితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

స్థల వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో ఇద్దరిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కథనం బాలకృష్ణ మేరకు.. తిరుచానూరు రోడ్డులోని నారాయణపురానికి చెందిన శ్రీమన్నారాయణరెడ్డికి ఇతరులకు కొంతకాలంగా భూ వివాదం జరుగుతోంది. ఈ సమయంలో తిరుపతికి చెందిన రజనీకాంత్, ట్రాన్స్‌కో ఏఈ వివాదం ఉన్న ప్లాట్‌లోకి ప్రవేశించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నించారు. దీనిపై బాధితుడు శ్రీమన్నా రాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా వర్శిటీ వద్ద అగ్ని ప్రమాదం

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి మహిళా వర్శిటీ వద్ద మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వర్శిటీ పక్కన వున్న ఖాళీ స్థలంలో పాత టైర్లు, చెత్తా చెదారం, ఇతర ముళ్ల కంపలు వున్నాయి. దీనికి గుర్తుతెలియని వ్యక్తులు కొందరు నిప్పు పెట్టారు. భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో మహిళా వర్శిటీ వద్ద వున్న కొన్ని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశారు.

వావిలాల గోపాలకృష్ణయ్యకు నివాళి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయోద్యమానికి ఆద్యుడైన వావిలాల గోపాలకృష్ణయ్య 22వ వర్ధంతిని నిర్వ హించారు. స్థానిక రాములవారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవ కేంద్రం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం కళాకారులు గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రమ్మణ్యంరెడ్డి, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ సీనియర్ అసిస్టెంట్ పీఆర్‌ఎల్ కుమార్, ఆఫీసర్ దాసరి లీలావతి, గవర్నింగ్ బాడీ సభ్యులు జయలక్ష్మి, ఫిలిం సొసైటీ సభ్యులు మేరీ జాన్ శాంతావాణి, ఆధ్యాత్మిక సేవా కేంద్రం శ్రీనివాసమూర్తి, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.

రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించాలి

● చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. రుయాస్పత్రి ఆవరణలో ఆయన మంగళవారం కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, వైజాగ్, గుంటూరు వంటి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తుంటే రుయాస్పత్రిలో అందించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రుయాస్పత్రి వంటి పెద్ద ఆస్పత్రిలో అన్ని విభాగాలు ఎందుకు నిర్వహించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అలిపిరి దగ్గర టీటీడీ కొత్తగా నిర్మిస్తున్న చిన్నపిల్లల ఆస్పత్రి భవనాన్ని రుయాకు అప్పగించాలని కోరారు. అనంతరం సూపరింటెం డెంట్ రవిప్రభును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలి


ఎస్వీయూ పరిపాలనా భవనం ముందు ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంతో పాటు వివిధ వర్శిటీలలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగలను పర్మినెంట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీయూ పరిపాలనా భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మాట్లాడుతూ యూనివర్శిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. యూనివర్శిటీల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు అందడం లేదని ఆయన విమర్శించారు.

చర్చల ద్వారా కశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలి

కాశ్మీర్ సమస్యను శాంతి చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించారు. యుద్ధంతో రెండుదేశాలకు నష్టం జరుగుతుందని తెలిపారు. 'కశ్మీర్‌లోనే ఉగ్రదాడులు ఎందుకు జరుగుతున్నాయి' అనే విషయంపై విశ్వ విద్యాలయాలు పరిశోధనలు చేయాలన్నారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు గోపి గౌడ్, రవి, రావణ్, నమీనుల్లా, శోభ, వేణుగోపాల్, కుమార్ పాల్గొన్నారు.

తిరుపతిలో ఏదీ ప్రశాంతత..!

● రోజూ ఘర్షణలు ● రెచ్చిపోతున్న మందుబాబులు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీలు, మందుబాబుల , ఆగడాలు ఎక్కువయ్యాయి. అడ్డొచ్చిన వారిపై ఏకంగా దాడులకు దిగుతున్నారు. పది రోజుల వ్యవధిలో మూడు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి ఘటనలతో ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంతత కరువ వుతోంది.

● మాధవనగర్‌కు చెందిన చిన్ని, గిరి మంచి స్నేహితులు. వీరు తరచూ కలసి మద్యం సేవిస్తుంటారు. ఈ క్రమంలో అదే కొర్లగుంటకు చెందిన వెంకీని తమ వద్దకు పిలిపించుకున్నారు. కొర్లగుంట జంక్షన్ వద్ద అందరూ కలిసి మద్యం తాగారు. పాత గొడవలు గుర్తుకు వచ్చాయి. గిరితో వెంకీ వాగ్వాదానికి దిగాడు. మద్యం మత్తులో గిరిపై దాడిచేశాడు. అతడు గాయపడ్డాడు.

● సోమవారం రాత్రి అమెరికన్ బార్ వద్ద మద్యం మత్తులో గాలివీధికి చెందిన బావాజాన్ సప్తగిరినగర్‌కు చెందిన వంశీతేజ ఘర్షణ పడ్డారు. వంశీతేజ గాయపడ్డాడు. రుయాలో చికిత్స పొందుతున్నాడు.

● దొడ్డాపురం వీధిలో నలుగురు రౌడీషీటర్లు ఉన్నారు. అక్కడ ఏ కార్యక్రమం జరిగినా వారి కనుసన్నల్లోనే జరగాలి. లేదంటే గొడవకు దిగుతున్నారు. ఇలా నగర పరిధిలో దాదాపు ఘర్షణలు ఎక్కువయ్యాయి.

మేడేను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం నిర్వహించే ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటరత్నం, వెంకయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల కార్మికులు మేడే దినోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ, లోకేష్, రాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీఆర్ బాండ్ల మేళా

● అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి

తిరుపతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతోందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయంలో టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన విషయం విదితమే. ఈ మేళాలో సుమారు 200 దరఖాస్తుల వరకు పరిశీలించామని ఆయన వివరించారు. అర్హులకు బాండ్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన దరఖాస్తుల పరిశీలన, రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలియజేశారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన పత్రాలను అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డీసీపీ మహా పాత్ర, ఏసీపీలు, ప్లానింగ్ సెక్రటరీలు అందరూ నగరపాలక సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ కోరారు.

వేదవర్శిటీకి అరుదైన తాళపత్రాల బహూకరణ



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేద వర్శిటీకి కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వెల్లలూరి వేంకటాద్రిశర్మ, పద్మావతమ్మ రక్షణలో ఉన్న అరుదైన తాళపత్రాలను మంగళవారం అందించారు. వీటిని తిరుపతిలో నివాసం ఉంటున్న వారి సోదరి భాస్కర త్రిపురాం, రామశాస్త్రిశర్మ కుమార్తె భాస్కర భారతీదేవి ద్వారా వర్శిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తికి అందించారు. భారతీయ విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో వర్శిటీలోని తాళపత్ర పరిరక్షణా కేంద్రానికి పత్రాలు అందించామని తెలిపారు. కాగా ప్రాథమికంగా ఈ తాళపత్రాలు భాస్కర రామాయణానికి సంబంధించినవిగా గుర్తించినట్లు వర్శిటీ అధికారులు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.భాస్కరుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ రాధేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మంగళం సమీపంలోని తిరుమల నగర్ పంచాయితీలో భవనంపైనుంచి పడి మృతిచెందిన ముగ్గురు కూలీల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. అనుమతులు లేని భవనాలను తనిఖీ చేయాలని కోరారు.

మృతదేహాల అప్పగింత

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాకాల మండలం తోటపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఘటన జరిగినరోజు మృతదేహాలను రుయాస్పత్రికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజయలక్ష్మి, సుహాన, రజని, లేఖన గౌడ, త్యాగరాజన్ మృతదేహాలకు మంగళవారం రుయా మార్చురీలో పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్ప గించారు. మార్చురీ వద్ద వారి బంధువులు కన్నీటిపర్యంత మయ్యారు.

ఎస్వీయూకు రూ.1.38 కోట్ల ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ విశ్వవిద్యాలయానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1.38 కోట్లు ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్ వర్శిటీ ఖాతాకు వచ్చినట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో ఆదాయ పన్ను శాఖ నుంచి తిరిగి రావడం ఆనందంగా ఉందన్నారు. విశ్వ విద్యాలయానికి రావాల్సిన ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్ కోసం కృషిచేసిన డాక్టర్ ఫల్గుణ కుమార్ సేవలు అభినందనీయమని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ కొనియాడారు.

గంజాయి స్మగ్లర్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ రామచంద్రకు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐలు జయశంకర్, హరికృష్ణ, మహేష్, హెడ్ కానిస్టేబుల్ సిద్ధయ్య, సిబ్బంది కలసి శెట్టిపల్లి రైల్వే గేటు వద్ద మంగళవారం నిఘా ఉంచారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న రాజీవ్‌నగర్‌కు చెందిన ఏ.సోమశేఖర్‌ను తనిఖీ చేశారు. అతడి వద్ద నున్న 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్స్ ధర్మయ్య, సుధాకరరాజు, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, కార్తీక్, రవీంద్ర, శ్రావణి పాల్గొన్నారు.

550 గ్రాముల గంజాయి స్వాధీనం


గంజాయితో పాటు నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

థ్యాంక్యూ సీఎం సర్

● రుద్రకోటి సదాశివం


థ్యాంక్యూ సీఎం సర్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న రుద్రకోటి సదాశివం, తదితరులు

తిరుపతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25వేలకు జీతం పెంచడంతో ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం స్థానిక చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో 'థ్యాంక్యూ సీఎం సర్' అంటూ పోస్టర్లను ప్రదర్శించారు.

విధి నిర్వహణలో హోంగార్డు మృతి


మృతిచెందిన సురేంద్రరెడ్డి

పాకాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపక కేంద్రంలోని హోంగార్డు సురేంద్రరెడ్డి (32) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సహచరులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సురేంద్రరెడ్డి స్వగ్రామం చిత్తూరు మండలం తాళంబేడు. ఈయనకు భార్య, ఆరునెలల పాప వున్నారు.

తిరుపతికి 8 వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో వుంచుకొని దక్షిణ మధ్య రైల్వే 8 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ఆ రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు చర్లపల్లి నుంచి తిరుపతి మధ్య మే8 నుంచి 29 వరకు ఈ ప్రత్యేక రైళ్లు ప్రతి గురు,శుక్రవారాల్లో రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు.



చిరంజీవి 'విశ్వంభర' కోసం
ఎదురు చూస్తున్నా
హీరోయిన్ ఆషిక రంగనాథ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'విశ్వంభర' సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాని హీరోయిన్ ఆషిక రంగనాథ్ తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె, ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ 'విశ్వంభర'లో చిరంజీవితో కలిసి నటించానని, అటువంటి స్టార్‌తో నటించాలంటే అదృష్టం కూడా ఉండాలన్నారు. కాగా తమిళంలో 'సర్థార్2', కన్నడలో మరో చిత్రంలో నటిస్తున్నట్టు వివరించారు.ఇక, తిరుమల శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందంటూ ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


దుమ్ములేవకుండా శుభ్రం చేస్తుంది

● టీటీడీకి విరాళంగా ఆధునిక వాహనం



తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దుమ్ము లేవకుండా వీధులు శుభ్రం చేసే వాహనం ఒకటి టీటీడీకి మంగళవారం విరాళంగా అందింది. రూ.25 లక్షల విలువైన ఈ వాహనాన్ని రోస్సారి ప్రొఫెషనల్ అనే సంస్థ విరాళంగా ఇచ్చింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వాహనం తాళాలు అందుకుని పనితీరును పరీక్షించారు. జర్మన్ కంపెనీకి చెందిన ఈ వాహనం చాలా అడ్వాన్స్ టెక్నాలజీతో కూడుకున్నదని ఆయన చెప్పారు. క్లీనింగ్ సమయంలో దుమ్ము పైకి లేవకుండా నీటిని చల్లుతూ ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తుందన్నారు. 8 గంటల పాటు ఛార్జింగ్ పెడితే దాదాపు 46 కిలోమీటర్ల మేర వినియోగించవచ్చని వివరించారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,904

తలనీలాలు సమర్పించినవారు: 24,487



బంగారం ధరలు ఇలా

24 క్యారెట్లు(10 గ్రాములు): 99,000

22 క్యారెట్లు(10 గ్రాములు): 89,904

సవర బంగారం : 74,112

కిలో వెండి : 1,00,300





కళ తప్పిన పసిడి

అక్షయ తృతీయ...గత కొన్నాళ్లుగా ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బంగారమే..వైశాఖ మాసంలో తొలి తదియకు పురాణాల ప్రకారం విశిష్ట ప్రాధాన్యముంది. ఈ రోజున ఏం చేసినా అక్షయంగా ఉంటుందని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అందుకే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఈరోజు కొంటే అక్షయంగా పెరుగుతుందని నమ్ముతారు. అందుకే మహిళలు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. వీరిని ఆకర్షించేందుకు బంగారం వర్తకులూ పోటీపడుతుంటారు. ప్రత్యేక ఆఫర్లు,డిస్కౌంట్లూ ప్రకటిస్తుంటారు. అయితే ఈ ఏడాది మున్నెన్నడూ లేని విధంగా బంగారం ధరలు పెరిగి కలవర పెడుతున్నాయి. కొనుగోలుదారులు..వర్తకుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. .షాపులో అడుగు పెట్టాలంటేనే మధ్యతరగతి వర్గాలు జంకుతున్నాయి. ఆశించిన అమ్మకాలు లేకపోవడంతో వ్యాపార వర్గాలూ నీరుగారుతున్నాయి. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఈ వర్గాలు నిరీక్షిస్తున్నాయి.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

● గణనీయంగా పెరిగిన బంగారం ధరలు ● వెలవెలబోతున్న షాపులు

● అక్షయ తృతీయ మీద వ్యాపారుల ఆశలు

ఆఫర్లు ప్రకటించి ఎదురుచూస్తున్నాం



చాలా రోజులుగా వ్యాపారం లేవు. ఖాళీగా ఉంటున్నాం. గత ఏడాదికంటే పది గ్రాముల బంగారం ధరపై సగటున రూ.3వేలకు పైగా పెరిగిపోయింది. కొనుగోలు దారులు బాగా తగ్గిపోయారు. కొంతకాలం ఆగి తరువాత కొనుగోలు చేసుకుందామని ఆలోచిస్తున్నారు. అక్షయతృతీయ సందర్భంగా తరుగు, కూలీఛార్జీలు లేకుండా ఆఫర్లు ప్రకటించాం. బుధవారం అయినా కొనుగోలుదారులు వస్తారని ఆశిస్తున్నాం.

- కె.వి. సత్యనారాయణ, అధ్యక్షుడు, తిరుపతి గోల్డ్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్

గత ఏడాది కంటే 30 శాతం పైకి ధరలు

తిరుపతి నగరంలో బంగారం షాపులు సుమారుగా 80వరకూ ఉన్నాయి. అన్ని బ్రాండెడ్ షాపులూ ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇక్కడ రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వ్యాపారలావాదేవీలు జరుగుతాయి. గతేడాది మే 10న అక్షయ తృతీయ పర్వదినం సరికి గ్రాము బంగారం ధర (24 క్యారెట్లు) రూ.6,600 ఉండేది. దీంతో ఒక్క అక్షయ తృతీయ రోజునే రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల వరకూ వ్యాపారం జరిగింది. కొద్ది నెలలుగా ప్రపంచ వాణిజ్య రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతం డాలర్ పౌండ్ విలువ రూ.3,000 నుంచి 3,500 వరకు ఉండగా.. వచ్చే సంవత్సరానికి ఆ ధర రూ.4,500 నుంచి రూ.6,000 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తర్వాత బంగారం ధర అమాంతం పెరిగిపోయింది. గతేడాది బంగారు గ్రాము ధర రూ.6,600 ఉండగా.. ఈ సంవత్సరం గ్రాము బంగారు ధర రూ.9,000కి చేరింది. అంటే రూ.3000 వరకూ పెరిగింది. ఈ ధరల పెరుగుదల ఇంతటితో ఆగుతుందనే నమ్మకం కూడా లేదు. దీంతో కొనుగోలుదారులు సంశయంలో పడిపోయారు.

రూ.2కోట్ల మేర వ్యాపారం జరగదా?

బుధవారం నాటి అక్షయ తృతీయ మీద వ్యాపార వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కనీసం రూ.2 కోట్ల మేరయినా అమ్మకాలు జరగకపోతాయా అని ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆశించిన మేర అమ్మకాలు జరగడంలేదని ఈ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. సాధారణంగా చాలామంది అక్షయ తృతీయ రోజున అంతోఇంతో బంగారం కొనుగోలు చేస్తుంటారు. కొద్దిరోజులుగా బంగారం ధరలు విని వీరు వెనుకంజ వేస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.లక్షకు ఎగబాకడంతో గుండెలు బాదుకుంటున్నారు. అక్షయ తృతీయకు ఈసారి పరిమితంగా కొనుగోలు చేయాలనుకుంటున్నామని తిరుపతిలోని కాపువీధికి చెందిన మధ్యతరగతి గృహిణి శ్రీదేవి చెప్పారు. మార్కెట్ ట్రెండ్ ప్రకారం ఈసారి ఆశించిన మేర అమ్మకాలు జరగకపోవచ్చునని కొందరు బంగారు వర్తకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

నాణ్యత తనిఖీకి అవకాశం

గతంలో బంగారం కొంటున్నప్పుడు చాలామంది నాణ్యత చూసేవారుకాదు. ఇప్పుడు కొనుగోలుదారుల్లో అవగాహన పెరిగింది. హాల్ మార్క్ ఉందోలేదో చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌యూఐడీ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి బంగారు వస్తువుపైన హెచ్‌యూఐడీ నంబర్ ఉంటుంది. బీఐఎస్ హాల్ మార్క్ తనిఖీ చేసి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకునే సౌకర్యముంది. దీని ప్రకారం బంగారం నాణ్యతను గుర్తించవచ్చు.

తిరుమలలో తెలంగాణవాసి మృతి

● మూర్ఛవ్యాధితో మరుగుదొడ్డిలోనే కుప్పకూలాడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఒక పబ్లిక్ మరుగుదొడ్డిలో మంగళవారం తెలంగాణవాసి ఒకరు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గద్వాల్‌కు చెందిన సురేష్‌గౌడ్(40) ఇరవై రోజుల కిందట ఇంటి నుంచి వచ్చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే సురేష్ గౌడ్ తిరుమలలో ఉంటున్నాడనే సమాచారంతో వారు రెండురోజుల కిందట తిరుమలకు చేరుకుని గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డిలో ఒక వ్యక్తి మృతదేహం ఉందని తెలిసి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతను సురేష్ గౌడ్ అని నిర్ధారించుకుని వారు కన్నీరుమున్నీరయ్యారు. గత కొంతకాలంగా సురేష్‌గౌడ్ మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడని, అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగాల తొలి జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తొలి జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఉద్యోగ నియామకాల నోడల్ అధికారి డాక్టర్ పార్థసారథిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను ప్రభుత్వ, ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. అందులో అభ్యంతరాలు కలిగిన అభ్యర్థులు మే 7వ తేదీ లోపు ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగ నియామకాల నోడల్ అధికారికి లిఖిత పూర్వకంగా పంపాలని పేర్కొన్నారు. అభ్యంతరాల కొరకు 80746 20526లో సంప్రదించాలని తెలిపారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.95కోట్లు



శ్రీకాళహస్తి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,95,63,129 వచ్చింది. హుండీలను మంగళవారం ఉదయం లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 47.100 గ్రాములు, వెండి 702.100 కిలోలు, విదేశీ కరెన్సీ 158 వచ్చాయి. గత నెల 27 నుంచి ఈ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

నిశిరాత్రి యజమానిని కాపాడిన శునకం

● ఏనుగుల వదంతితో బావిలో పడిన వ్యక్తి

● కుక్క అరుపులు విని రక్షించిన అటవీసిబ్బంది



ఈశ్వరరావుతో అటవీసిబ్బంది

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యజమాని ప్రాణాలను కాపాడిందో శునకం. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల, దేవరకొండ పంచాయతీలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను గుర్తించేందుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలోకి ప్రవేశించారు. అప్పటికే రాత్రి ఒంటి గంట దాటింది. అదే సమయంలో .సుబ్బరామాపురానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన పెంపుడు కుక్కతో పొలం వద్దకు కాపలాగా ఉన్నాడు. చుట్టు పక్కల రైతుల నుంచి ఏనుగులొచ్చాయంటూ గట్టిగా అరుపులు వినపడడంతో ఈశ్వరయ్య ఉలిక్కిపడ్డాడు. వెంటనే పరుగుతీశాడు. ప్రాణభయంతో హడావిడిలో దగ్గరలోని బావిలో పడిపోయాడు. కటిక చీకటి. సమీపాన ఎవరూ లేరు. అయితే యజమాని కష్టంలో ఉన్నాడని అతని పెంపుడు కుక్క గ్రహించింది. అదేపనిగా గట్టిగా అరవడం ప్రారంభించింది. ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఎఫ్ఆర్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలోని ఏలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ గమనించింది. ఏం జరిగిందో తెలుసుకుందామని వెంటనే అక్కడకు చేరుకుంది. భావిలో పడి ఉన్న ఈశ్వర్యను గుర్తించింది. అటవీశాఖ సిబ్బంది దిగి ఈశ్వరరావును రక్షించి బయటకు తీశారు. పెంచుతున్న విశ్వాసానికి అర్ధరాత్రి అరణ్యప్రాంతంలో ఆ శునకం చూపిన ప్రేమాభిమానానికి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు.

ఇక, రాత్రి గస్తీల్లో డ్రోన్

● పోలీసుల అదుపులో పది మందికి కౌన్సెలింగ్



డ్రోన్ కెమెరాతో పోలీసుల పహారా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాత్రి గస్తీల కోసం కేవలం బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు మాత్రమే రోడ్లపై తిరిగేవారు. అన్ని వీధులు, సందులు, గొందుల్లోకి వెళ్ళడానికి వీరికి సాధ్యపడే పని కాకుండా పోయింది. ఈ క్రమంలో రాత్రి గస్తీకి డ్రోన్ వినియోగించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు భావించారు. దీనికిగాను అత్యంత శక్తిమంతమైన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా వినియోగించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి తిరుపతి, శివారు ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి రాత్రి పహారా కాశారు. తద్వారా అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న అకతాయిలు, కొందరు మందుబాబులను గుర్తించారు. అలా 10 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా రాత్రి గస్తీల్లో డ్రోన్‌నూ భాగస్వామిని చేయనున్నారు. దీనికోసం తిరుపతి నగరాన్ని మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో ఒక్కో రాత్రి డ్రోన్ నిఘా ఉంచుతారు. ఇది అరకిలోమీటరుకు పైగా నింగిలోకి వెళ్లి.. మూడు కిలోమీటర్ల వ్యవధిలో కవర్ చేస్తుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడ నుంచైనా ఎమర్జెన్సీ కాల్ వస్తే వెంటనే డ్రోన్ కెమెరా ద్వారా లొకేషన్ అడ్రస్ ట్రేస్ చేసి బాధితులకు న్యాయం చేసే వెసులుబాటు కలుగుతోంది. లొకేషన్ అడ్రస్ చెప్పడం ఆలస్యం కాకుండా డ్రోన్ కెమెరాను అటుగా దిశ మళ్ళించి ఆగమేఘాల మీద ఆకాశంలో దూసుకుంటూ స్పాట్‌కు చేరుతుంది. తద్వారా పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటారు. తిరుపతి ప్రజలు, భక్తులు అర్ధరాత్రయినా ప్రశాంతమైన వాతావరణంలో గడపాలనే ఉద్దేశ్యంతో ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ చెప్పారు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపల్స్‌ను, సూపరింటెండెంట్‌లను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్ రవిప్రభును ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిల్లో తిరుపతి, నంద్యాల, నెల్లూరు వైద్య కళాశాలల ప్రిన్సిపల్ నియామకాల్లో మంగళవారం మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా మొదట రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించిన అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ జె.రాధను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ పొందిన అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. రవిప్రభు రుయా సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.08 లక్షల మంది

● నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 16.05 లక్షల మంది రేషన్ కార్డుల్లో సభ్యులుగా వున్నారు. వీరిలో ఈనెల 29 వరకు దాదాపు 15 లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇక 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోకుండా దూరంగా వున్నారు. వీరందరికీ బుధవారం ఆఖరి గడువు విధించింది. అప్పటికే మూడు సార్లు గడువు పెంచిన ప్రభుత్వం మళ్లీ ఈకేవైసీ చేసుకోవడానికి గడువు పెంచుతుందా లేదా అనేది బుధవారం సాయంత్రానికి తెలుస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, గూడూరు, కోట, నాయుడుపేట, పుత్తూరులోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాల కోసం అర్హత గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజా సోము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.లక్ష మించరాదన్నారు. అలాగే 4 నుంచి 9వ తరగతి వరకున్న ఖాళీలకు కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99856 74700లో సంప్రదించాలన్నారు.

జయరాంచౌదరిని వర్చువల్‌గా విచారించనున్న కోల్‌కత్తా హైకోర్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'మయూర జయరాం చౌదరిని కోల్‌కత్తా హైకోర్టు బుధవారం వర్చువల్ విధానంలో విచారించనుంది. చక్కెర సరఫరా చేస్తామంటూ కోల్‌కత్తాకు చెందిన టిరాయ్ ఓవర్సీస్ సంస్థతో 2014లో జయరామచౌదరి ఒప్పందం చేసుకుని రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. దీనిపై విచారించిన న్యాయస్థానం జయరాంచౌదరిని అరెస్టుచేసి కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. ఆ మేరకు తిరుపతి పోలీసులు అరెస్టుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని పోలీసుల సమక్షంలో వర్చువల్ విధానంలో విచారించనుంది.



రాజపక్సకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీఈవో

తిరుమలలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీలంక మాజీ అధ్యక్షుడు నందసేన గొటబయ రాజపక్స శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని సమిష్టి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవోఆర్ భాస్కర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. రాజపక్స బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)లో 2025 విద్యాసంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 9492861369, 8500021856 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్మగ్లర్ అరెస్టు

మంగళం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భాకరపేట అటవీప్రాంతంలోకి ప్రవేశిస్తున్న ఓ స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బారిసను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం భాకరాపేట చామల సెక్షన్‌లో కూంబింగ్ నిర్వహించారు. తిరుపతి -పీలేరు రోడ్డు వైపున నిషేధిత అటవీప్రాంతంలోకి ముగ్గురు వ్యక్తులు వెళుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసుల కంటపడ్డారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా అడవుల్లోకి పారిపోయారు. అయితే ఒకరిని పట్టుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 గంటలు ఆలస్యంగా 'పూరీ ఎక్స్‌ప్రెస్'

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుపతి- పూరీ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ తొమ్మిది గంటలు ఆలస్యంగా నడిచింది. సోమవారం రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్, మంగళవారం ఉదయం 7 గంటలకు చేరుకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. భక్తులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న వారు నిర్ణీత సమయానికి దర్శనానికి వెళ్ళలేక పోయారని తెలిసింది. సకాలంలో తిండి లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, మంగళవారం తిరుపతిలో 10.40 గంటలకు బయలు దేరాల్సిన పూరీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.45 గంటలకు బయలు దేరి వెళ్ళిందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు తిరుపతి రైల్వే స్టేషన్‌లో మూడుగంటలు నిరీక్షించారు.

సూర్యవంశీ ఒక అద్భుతం

● శ్రీవారి సన్నిధిలో చెబుతున్నా పెద్ద ప్లేయర్ అవుతాడన్న క్రికెటర్ శ్రీశాంత్



ఆలయం ముందు కుటుంబంతో శ్రీశాంత్

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'సచిన్ టెండూల్కర్ రంజీ మ్యాచుల్లో 14 ఏళ్లకే సెంచరీ చేసిన విషయాన్ని విన్నాం. ఐపీఎల్ వంటి పెద్ద ఆటలో 14 ఏళ్ల కుర్రాడు సెంచరీ కొట్టడం అంటే అదో అద్భుతం. గుజరాత్‌పై మ్యాచ్‌లో సూర్యవంశీ సూర్యుడిలా చెలరేగిపోయాడు' అని టీం ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ప్రశంసలతో ముంచెత్తారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి చెప్తున్నా వైభవ్ సూర్యవంశీ చాలా పెద్ద ప్లేయర్ అవుతాడన్నారు.

ది రియల్ తలై అజిత్ అన్నా

తమిళ హీరో అజిత్ పద్మభూషణ్ అవార్డు తీసుకోవడంపై శ్రీశాంత్ సంతోషం ప్రకటించారు. అజిత్‌కు తానో పెద్ద అభిమానని, ఆయన డైలాగ్స్ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. 'ది రియల్ తలై అజిత్ అన్నా' అన్నారు. ఇక, రాజకీయాల్లో ఎంట్రీపై ప్రశ్నించగా ప్రస్తుతం అలాంటి ఆలోచనలు ఏవీ లేవని బదులిచ్చారు.

చెరువులో యువకుడి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతదాసుపల్లి చెరువులో మంగళవారం ఓ యువకుడి మృతదేహం నీటిపై తేలియాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలంలోని సంతదాసుపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్(31) తండ్రి మృతి చెందడంతో కొంతకాలంగా గూడూరులోని వామలమిట్ట ప్రాంతంలో తల్లి సుజాతమ్మతో కలిసి నివాసముంటున్నాడు. ఓ ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్న ప్రశాంత్ ఈనెల 26వ తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం సంతదాసుపల్లి చెరువులో ప్రశాంత్ మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి, రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

బైక్ బోల్తా: ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన నాగరాజు

బాలాయపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మోటరు బైక్ బోల్తాపడి ఒకరికి తీవ్రగాయాలపాలైన ఘటన బాలాయపల్లి మండలంలోని నిండలి సమీ పంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరి మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన నాగరాజు డక్కిలి మండలంలోని దగ్గవోలు గ్రామంలోని అత్తగారి ఇంటికి మోటరు బైక్‌లో వెళ్తుండగా నిండలి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నాగరాజుకు రెండు చేతులు విరిగిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో నాగరాజును గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 16 మందికి రూ.8.52 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారు తన కార్యాలయంలో సంప్రదిస్తే వారికి కూడా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వాటంబేడు శివకుమార్, కిషోర్ నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, వెంటేశ్వర్లురెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, చంద్రమౌళి, రవీంద్రరెడ్డి, ఇశ్రాయేల్‌కుమార్, జలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడలకు అందాల పోటీలు



పాడి రైతులకు బహుమతులను అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, పశువైద్యులు

చిల్లకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిపేడు గ్రామంలో మంగళవారం నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించామన్నారు. లేగ దూడలను ఆరోగ్యంగా పోషిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే అధిక లాభాలను పొందవచ్చునన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై పలు పథకాలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దూడలకు డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. అందాల పోటీల్లో విజేతగా నిలిచిన దూడల యజమానులతో పాటు పోటీల్లో పాల్గొన్న పాడి రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఉపసర్పంచు నందకుమార్ యాదవ్, పశువైద్యులు సుబ్రహ్మణ్యం, షిరాజ్‌ఖాన్, పాడిరైతులు పాల్గొన్నారు.

పెన్నక్క చెరువు జల వివాదం పరిష్కారం



పెన్నక్కచెరువు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్క చెరువు జల వివాదానికి మంగళవారం అధికారులు పరిష్కారం చూపారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోట, చిల్లకూరు మండలాల ఆయకట్టు రైతులతో తహసీల్దార్ జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం చర్చలు జరిపారు. పెన్నక్క చెరువు కింద రెండో కారు వరి పంటలు వేసేందుకు ఆయకట్టు రైతులతో పాటు ఇతరులూ ప్రయత్నాలు చేశారు. అనధికారికంగా చెరువులో మోటార్లు పెట్టి నీటి సరఫరా చేస్తుండడంతో ఆయకట్టు రైతులు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కల్పించుకుని ఆయకట్టుదారులతో పాటు ఇతర రైతులనూ సమావేశపరిచి మాట్లాడారు. ఈ ఏడాది మాత్రమే చెరువు నీటిని వాడుకుని రెండో కారు పంటలు వేసేందుకు రైతులంతా అంగీకరించడంతో సమస్య పరిష్కారం అయింది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో భవన నిర్మాణాల కోసం లైసెన్స్ ఇంజనీర్లు, టెక్నికల్ పర్సన్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మంగళవారం తెలిపారు. ఐటీఐ, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్‌ను సంప్రదించవచ్చన్నారు.

మాజీ సర్పంచి కృష్ణారెడ్డి మృతి



వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పారవోలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి పుల్లూరు కృష్ణారెడ్డి మంగళవారం మృతి చెందారు. మాజీ ముఖ్యమంత్రి నేదరుమల్లి జనార్దరెడ్డికి సన్నిహితుడైన కృష్ణారెడ్డి మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై 15ఏళ్ల పాటు సర్పంచిగా కొనసాగారు.

ప్రశాంత వాతావరణంలో పోలేరమ్మ జాతర: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఆర్డీవో కిరణ్మయి, నెలవల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ చెంచుబాబు తదితరులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరను అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. జాతర నిర్వహణపై మంగళవారం నాయుడుపేట ఆర్‌అండ్‌బీ గృహ ప్రాంగణంలో ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన పండుగలను తమ ఆధ్వర్యంలో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గ్రామదేవత పోలేరమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతర కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ ఉరుసు, ఏటి పండుగ, పక్షుల పండుగలు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి అధికారులు, నాయకులు సహకరించడం సంతోషించ దగ్గవిషయమన్నారు. అలాగే పోలేరమ్మ జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. దేవదాయశాఖ ఈవో రవికృష్ణ మాట్లాడుతూ మే 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే జాతరలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అర్బన్ సీఐ బాబి, తహసీల్దార్ రాజేంద్ర, కమిషనర్ ఫజులుల్లా, విన్నమాల పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి విద్యుత్ డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ శివశంకర్, నానబాల సుబ్బారావు, గంగాప్రసాద్, సుదీర్‌రెడ్డి, పొట్లపూడి రాజేష్, రామారావు, చిరంజీవి, అంజయ్య, మైలారి రాజశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ఆరోపణలు: టీడీపీ



శ్రీనివాససత్రం వద్ద మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో సముద్రతీర మండలాలు పారిశ్రామిక వాడలుగా మారుతున్నాయని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస సత్రంలో వేరుశనగ పంటలను టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు.ఎంత మేర పంటలు వేశారు.. పరిహారం ఎంత వచ్చింది.. అన్న విషయాలను బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని కోట, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీరప్రాంత గ్రామాలు క్రిస్ సిటీ, చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్‌తో పారిశ్రామిక హబ్‌గా మారిపోతున్నాయన్నారు. కొత్తపట్నం ప్రాంతంలో గతంలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష ఇస్తామని చెప్పిన వైసీపీ నాయకులు ప్రస్తుతం రూ.8లక్షలు ఇవ్వడం చూసి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కొంతమంది రైతులకు పట్టాలు లేకపోయినప్పటికీ వేరుశనగ పంటకు పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. ఇకనైనా ఆరోపణలు మాని అభివృద్ధికి సహక రించాలని హితవుపలికారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు తిరుమూరు మురళి, మాజీ ఎంపీటీసీ వాటంబేటి చెంగల్‌రావు, అనుక్, చల్లా సురేష్, వెంకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తి మృతి ఘటనలో 13మందిపై కేసు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని ద్వారకాపురం వద్ద ఆదివారం రాత్రి బైక్‌ను మినీ వ్యాన్ ఢీకొనడంతో ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురుమూర్తి మృతిచెందిన విషయం తెలిసిందే. తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేశారని మృతుడి కుమారుడు గురుతేజ మంగళవారం నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగి కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మృతుడు గురుమూర్తి అదే గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటర్ సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి బయలు దేరారు. ఈ విషయం తెలుసుకున్న గురుమూర్తి ప్రత్యర్థులు మినీవ్యాన్‌లో నాయుడుపేట నుంచి వెంబడించి ద్వారకాపురం వద్ద మోటర్ సైకిల్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వాహనంలోని ఇద్దరు వ్యక్తులను మరో వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తిరుపతి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, గురుమూర్తి బైక్‌ను ఢీకొన్న మినీవ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎస్పీ ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ఇటీవల అత్తివరంలో పరిశ్రమలు నెలకొల్పడంతో కాంట్రాక్ట్ పనుల విషయమై తలెత్తిన విభేదాలే గురుమూర్తి హత్యకు కారణమని సమాచారం.

వేడుకగా ధర్మరాజస్వామి రాజసూయ యాగం



గ్రామోత్సవంలో ద్రౌపదీదేవి

తడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాజసూయయాగం అట్టహాసంగా జరిగింది. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ద్రౌపది సమేత ధర్మరాజస్వామి రాజసూయ యాగాన్ని వేదపండితులు శాస్త్రోతంగా నిర్వహించారు. తరువాత ప్రత్యేక పూలతో అలంకరించి ధర్మరాజస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ జరిగింది. బుధవారం గరుడసేవ జరుగనున్న నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నోటిఫికేషన్ ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్ రద్దు చేయండి



ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్ ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఏవో రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని, దీని వల్ల గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ఆ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని వ్యవయసా కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెలుగు రమేష్, రైతులు ఎం.సత్యనారాయణ, డి.వేణుగోపాల్, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

గ్రైండర్ అందజేత

నాయుడుపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న తీగల రాము, ఉష దంపతులకు బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ సభ్యులు గ్రైండర్ అందజేశారు. కార్యక్రమంలో పగడాల శివప్రదీప్, హంసా పృథ్వీచంద్, చింతపూడి శ్రీధర్, గడదాసు వెంకటేశ్వర్లు, నీలం హరికృష్ణ, దర్శి కిరణ్, మోతుకోరు కోటేశ్వరావు, మదిరి వెంకి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ప్రయాణికుడు
ఎంతకీ లేవకపోవడంతో ఆందోళన



మద్యం మత్తులో ఉన్న ప్రయాణికుడు

చిట్టమూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం తాగి బస్సెక్కి సీట్లో కూర్చున్న ప్రయాణికుడు స్పృహ కోల్పోవడంతో డ్రైవర్, కండెక్టర్ ఆందోళనకు గురయ్యారు. నాయుడుపేట నుంచి మల్లాం వెళ్లే ఆర్టీసీ బసెక్కిన ఓ ప్రయాణికుడు సీట్లో కూర్చున్నాడు. బస్సు మిట్టకండ్రిగ స్టేజి దగ్గర వెళ్తుతుండగా మహిళా కండక్టర్ టికెట్ తీసుకోమని అడిగారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఎంత పిలిచినా లేవలేదు. డ్రైవర్, ప్రయాణికులు తట్టి లేపినా కదలిక లేవకపోవడంతో ఆందోళన చెందారు. ఇంతలో బస్సు కొత్తగుంటకు చేరుకోవడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నించారు. ఇంతలో కొందరు ముఖంపై నీళ్లు చల్లడంతో స్పృహలోకి వచ్చాడు. అయితే తాను ఎవరన్నది చెప్పలేకపోయాడు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ రాధ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈమె రుయాలో అనస్తీషియా విభాగాధిపతిగా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. అనంతరం డాక్టర్ రాధ బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రెండు రోజులు క్రితం రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపాళ్లను, సూపరింటెండెంట్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్‌ను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

గోశాలకు జెంబో కూలర్ల వితరణ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా టీటీడీ గోశాలకు ఓ దాత రెండు జెంబో కూలర్లను వితరణ చేశారు. హైదరాబాదుకు చెందిన రంగశ్రీ (టీటీడీ బోర్డు సభ్యురాలు) అధునాతనమైన రెండో జెంబో కూలర్‌ను తిరుపతికి చేర్చారు. వాటిని జనసేన నేత కిరణ్‌రాయల్ మంగళవారం గోశాల డిప్యూటీ డైరెక్టర్ ఉపేంద్రవర్మ, డాక్టర్ భువనలకు అందజేశారు. కాగా ఇప్పటికే కిరణ్‌రాయల్ రెండు జెంబో కూలర్లను వితరణ చేయగా లేగదూడలకు వినియోగిస్తున్నారు.

అసత్య ఆరోపణలు తగవు: పాశిం

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తనపై అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతికాదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాయంలో మాట్లాడుతూ తాము ప్రతిపక్ష నేతలతో చేతులు కలిపినట్లు కొన్ని ఛానళ్లు, పత్రికల్లో వార్తలు ప్రచారం చేయడం అవాస్తవమన్నారు. కోట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సర్వోత్తమ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారని, ఇతనితో తనకు ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. కష్టకాలంలో పార్టీ బలోపేతానికి సర్వోత్తమరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. త్వరలోనే ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు.

ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రతిభ చూపిన ఎన్‌బీకేఆర్ కళాశాల విద్యార్థులను మంగళవారం డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈసీఈ విద్యార్థులు నవంత్‌రెడ్డి, గోపి, కృష్ణకుమార్ ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీ నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఏఐ సొల్యూషన్ ఫర్ సస్టైనబుల్ ఎలక్ట్రానిక్ అండ్ వైర్‌లెస్ సిస్టమ్స్ అంశంలో అనాలసిస్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ కోర్ బిట్ ఏఎల్‌యు ఫర్ నానో ప్రాసినర్ డిజైన్ ఫ్యూజింగ్ సిమోస్ టెక్నాలజీ సాంకేతిక పత్ర ప్రదర్శనకు బెస్ట్ పేపర్ అవార్డు లభించింది. ఆయా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ హరినాథరెడ్డి ప్రశంసా పత్రాలతో అభినందించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న పొన్నూరు శీనయ్య (45) మంగళవారం మృతిచెందాడు. తిన్నెలపూడి పంచాయతీలోని నారుమిట్ట గిరిజన కాలనీకి చెందిన శీనయ్యను బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేద మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు.మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అబ్దుల్‌రహీం, మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అలిపిరి పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అజిత కథనం మేరకు.. స్థానిక రాఘవేంద్రనగర్‌కు చెందిన రవీంద్ర పార్శిల్ కార్యాలయంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు పది రోజుల క్రితం ఇస్కాన్ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం ఉంచి పనిమీద వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూడగా వాహనం లేదు. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమపేరుతో మోసం.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన వ్యక్తిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సరస్వతి కథనం మేరకు.. స్థానిక కెనడీనగర్‌కు చెందిన ఎన్‌వీ లక్ష్మి రేణిగుంట రోడ్డులోని ఒక ప్రైవేటు హౌసింగ్ కంపెనీలో పనిచేస్తోంది. ఈమెకు ఇటీవల గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన వడివేలుతో పరిచయమైంది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో వడివేలు మరొకరితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

రెండో రోజు కొనసాగిన రిలే దీక్ష



గూడూరు డిపో వద్ద రిలే దీక్ష చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్యారేజీలో సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళా కండక్టర్లను ఇబ్బంది పెట్టకుండా అన్ని రకాల సెలవులను అమలు చేయాలన్నారు. అలాగే అర్హత ఉన్నవారందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చెంచులయ్య, శ్రీనివాసులు, కృష్ణ, ప్రవీణ్, గౌస్, కమలాకర్, గాంధీ, రవి, నారాయణరావు, నరసింహప్రసాద్, సందానీ, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ఆర్టీసీ కార్మికుల సాధన కోసం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రీలే దీక్ష మంగళవారం రెండోరోజూ కొనసాగింది. ప్రభుత్వం స్పందించి తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిపో ప్రెసిడెంట్ పీవీరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబు, మణ్యం, చలపతి, రజాక్, మస్తానయ్య, అంకయ్య, దశయ్య, బాబు, రాము పాల్గొన్నారు.

నేటినుంచి రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో ఈ నెల 30 నుంచి మే 2వ తేదీ వరకు రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి.

బదిలీ చేయిస్తానని రూ.5 లక్షల స్వాహా

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బదిలీ చేయిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన కుమారి గతంలో రుయా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసింది. గత ప్రభుత్వంలో ఆమెను కడప రిమ్స్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో రామచంద్రాపురం మండలం పరమాలకు చెందిన చెంగల్రాయులు తనకు ఆరోగ్యశాఖలో బాగా తెలిసిన అధికారులు ఉన్నారని రూ.5 లక్షలు ఇస్తే ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని నమ్మించి నగదు తీసుకున్నాడు. అయితే బదిలీ కాలేదు. దీంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె కోరింది. అతడి నుంచి సమాధానం రాకపోవడంతో మంగళవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మ హత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం తిరుపతిలో చోటు చేసుకుంది. యూని వర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు.. కుప్పం మండలం బంగారునత్తానికి చెందిన జగదీష్ ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నాడు. ఈయన కుమార్తె ఆరాధన(21) మారుతీ నగర్ వద్ద వున్న పీజీ హాస్టల్లో ఉంటూ పద్మావతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్స రం చదువుతోంది. ఈమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మంగళవారం హాస్టల్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు.

విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు: ఏపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో గందరగోళ పరిస్థితులకు ప్రభుత్వం కారణమవుతోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాల అంటే 1 నుంచి 5వ తరగతి వరకు అని దాన్ని మోడల్ పాఠశాలగా కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న మూడు డీఏలను తక్షణం ప్రకటించాలన్నారు. బదిలీలను మాన్యువల్ కౌన్సె లింగ్‌లో నిర్వహించాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కాకపోతే మే 5న పాత తాలుకా కేంద్రాల్లో, 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వెంకటాద్రి, గోపాల్, సురేష్‌బాబు, చంద్రశేఖర్, హరి, గజేంద్ర, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో అవకతవకలు


అసంపూర్తి ఇంటిని పరిశీలిస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ కాలనీ పంచాయతీలో 2021-24 మధ్య గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహాల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని సామాజిక కార్యకర్త ఆడిపూడి ఆశ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ శాఖ డీఈ శేషగిరిరావు సుమారు 53 ఇళ్లకు సంబంధించి నిర్మాణం పూర్తి చేయకనే లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అయినట్టు గుర్తించారు. సుమారు రూ.13,75,891 దుర్వినియోగం అయినట్లు తేల్చారు. ఇందుకు కారణమైన అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు డీఈ తెలిపారు.

పుత్తూరు వార్తలు

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : ఎంపీపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మునివేలు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తడుకు, శిరుగురాజపాలెం సర్పంచులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రతినిధులు ఏ పనులు కావాలో గుర్తిస్తే వాటిని చేపడతామని ఎంపీడీవో రమేష్‌బాబు చెప్పారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్మశానాలకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వైస్ ఎంపీపీలు మునస్వామి రెడ్డి, విమలమ్మ, ఈవోఆర్డీ దేవిక, ఎంఈవో తిరుమలరాజు, ఏపీవో మమతారాణి, సూపరింటెండెంట్ వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకే పాదయాత్ర


గీతా సమాజంలో అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామిజీ

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణలో భాగంగా గోసంరక్షణ, గ్రామీణ చేతి వృత్తుల అభివృద్ధి, రైతు సంక్షేమం, జానపదుల కళల అభివృద్ధి కోసమే పాదయాత్ర చేస్తున్నట్లు ఉడుపి పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఎం గేటు నుంచి సదాశివేశ్వర ఆలయం వరకు పాదయాత్ర చేశారు. సదాశివేశ్వరాలయంలోని గీతా సమాజంలో అనుగ్రహ భాషణం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని షోళింగర్ నుంచి పాదయాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. హైందవ ధర్మాన్ని ప్రతి ఒక్కరు కాపాడుకోవాల్సి ఉందన్నారు. రామారావు, శ్రీధర్, వీహెచ్‌పీ ప్రతినిధులు బాబు, సుబ్రమణ్యం, కుమారస్వామి, రామ కృష్ణ, దిలీప్‌కుమార్, నాగేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఎన్ఎంయూఏ దీక్ష

పుత్తూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోసం పుత్తూరు డిపో కార్యాలయం వద్ద ఎన్ఎంయూఏ కార్మికులు చేపడుతున్న దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ మాట్లాడుతూ... దశల వారీగా చేస్తున్న ఆందోళనలో భాగంగా నేడు నిరాహార దీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ యాజమాన్యం స్పందించక పోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో నాయకులు మనోహర్, శేఖర్, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

2న ఆది శంకరాచార్యులు జయంతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో మే 2వ తేదీ ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలోని కళావేదికలో ఉదయం 9 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నిత్యం ఇదే పరిస్థితి!

చిన్నపాండూరులో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం


గోతిలో దిగబడిన బస్సు - స్తంభించిన రాకపోకలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరులో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే పరిస్థితి అని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాండూరు ప్రధార రహదారి కదూరు నుంచి సత్యవేడువైపు వెళ్లే దారిలో గ్యాస్ పైపులైను కోసం తవ్వారు. మరో పక్క తాగునీటి పైపులైను కోసం తవ్వకాలు చేపట్టడంతో వాహన రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. అంతేకాకుండా గుంతలోడిన చోట మట్టిని సరిగ్గా వేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఉద్యోగులు, కార్మికులను పరిశ్రమలకు తీసుకెళ్లే బస్సులు, లారీలు ఆ గుంతల్లో దిగబడి పోతున్నాయి. దీంతో గంటల తరబడి వాహన రాకపోకలు స్తంభించిపోతున్నాయి. రహదారి పక్కనే గుంతలు లోడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. మంగళవారం రాత్రి ఇదే జరిగింది. కార్మికులను తరలించే బస్సు మట్టిలో కూరుకుపోవడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పదో తరగతి ప్రత్యేక తరగతుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యా సంవత్సరం వృథా కాకుండా ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులయ్యే విధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మంగళవారం టీడీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ తాటిపర్తి రవీంద్రనాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అమాసను సత్కరించి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు.

అంబలి పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు కూడలి వద్ద కాపునాడు, జనసేన నాయకులు సంయుక్తంగా మంగళవారం అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, చంద్రశేఖర్, రాజేష్, స్వర్ణమూర్తి, మాధవ మహేష్, ప్రతాప్, హరిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహిద్దాం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎమ్మెల్యే, ఆర్డీవో తదితరులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల ప్రోత్సహిద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు నిచ్చారు. మంగళవారం పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కేవీబీ పురం మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆదిమూలం, ఆర్డీవో భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చక్కగా చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ, ఎంఈడీ వంటి ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రభుత్వ టీచర్లు అందరూ కష్టపడి బాధ్యతాయుతంగా పని చేసి పేద విద్యార్థులకు చక్కగా చదువు నేర్పి వారి ఉన్నతికి సహకరించాలని కోరారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల మేధస్సును వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే అభిలషించారు. అనంతరం 4 మండలాల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆర్డీవో భానుప్రకాష్‌తో కలసి పతకాలు, ప్రశంసా పత్రాలు అందించి, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవైఈవో ప్రభాకర్‌రాజు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఎంఈవో హేమాలిని, బాబయ్య, యుగంధర్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు కొలత తీస్తుండగా ... అడ్డుకున్న పంచాయతీ సిబ్బంది

రేణిగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ రోడ్డును కొందరు కొలతలు తీస్తుండగా సిబ్బంది అడ్డుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరుమారి యమ్మ ఆలయం పక్కన ఉన్న స్థలాన్ని చదును చేశారు. సమీపంలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు దీనిపై అప్పటి సర్పంచ్ పాక్యముత్తు దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో పంచాయతీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పాలకమండలి ఆమోదంతో ప్రజా అవసరాల కోసం పంచాయతీ నిధులతో ఆ స్థలంలో సిమెంటు రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు వినియోగంలో ఉంది. అయితే ఆ రోడ్డును మంగళవారం ఉదయం కొందరు కొలతలు తీశారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి మణి మాట్లాడుతూ... పంచాయతీ నిర్మించిన రోడ్డు స్థలం తమకు రిజిస్ట్రేషన్ అయ్యిందని ఓ వ్యక్తి కొలతలు తీశాడన్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం స్థానిక ప్రభుత్వ భూముల్లో పంచాయతీ అవసరాలకు చేపట్టిన నిర్మాణాలు, నిర్మించిన రోడ్లు, ఇళ్ల మధ్యలో నడిచే సందులు పంచాయతీకి చెందినవే అని స్పష్టం చేశారు.

పర్యాటక స్థలాల సందర్శనతో మానసికోల్లాసం


ఆరె జలపాతం వద్ద స్కౌట్స్ అండ్ గైడ్స్

కేవీబీపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి పర్యాటక స్థలాల సందర్శన ఎంతో అవసరమని కేజీబీవీ డీసీబీవో పుష్ప చెప్పారు. మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు ఆరె జలపాతానికి విద్యార్థులను తీసుకెళ్లారు. అక్కడ జలపాతం, ప్రకృతిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ విజయకుమార్, సావిత్రి, సతీసావిత్రి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థికి కలెక్టర్ ప్రశంస


లక్ష్మీప్రసాద్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్

సత్యవేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు బీసీ హాస్టల్‌లో చదువుకుంటూ ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పి.లక్ష్మీప్రసాద్‌కు కలెక్టక్ వెంకటేశ్వర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో లక్ష్మీప్రసాద్ ఎంపీసీలో 981 మార్కులు సాధించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్‌ను కలెక్టర్ అభినందించి ప్రశంశా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేందర్ రెడ్డి, సహాయక అధికారి కృష్ణయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం పోలీస్‌స్టేషన్ తనిఖీ

కేవీబీపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను పుత్తూరు రూరల్ సీఐ రవిచంద్ర మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని ఆదేశించారు. అలాగే స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌస్ ఇన్‌ఛార్జి విశ్వనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా రామ్‌నాయక్

కేవీబీపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శాశ్వత వైద్యాధికారిగా రామ్‌నాయక్‌ను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేసిన సాయిజ్యోతి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో రామ్‌నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వైద్యాధికారి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని మసాలాలు, నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తీసుకోకూడదని తెలిపారు.

11నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 11 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. 11వ తేది ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి పెద్ద శేషవాహన సేవ నిర్వహిస్తారు. 12న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 13న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 14న కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 15న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహన సేవలుంటాయి. అలాగే 16వ తేది ఉదయం హనుమంతు వాహనం, రాత్రి గజ వాహనం, 17న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 19న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ అనంతరం స్వామివారికి కల్యాణోత్సవం, 19న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్య, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. మే 18వ తేది రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.1000 చెల్లించి గృహస్తులు పాల్గొనవచ్చు. గృహస్తులకు ఉత్తరీయం, రవిక, లడ్డూ, వడ, కుంకుమ ప్రసాదాలను అందిస్తారు. అలాగే టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బ్రహోత్సవాల జరిగే రోజుల్లో ఆధ్యాత్మిక భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

బాల్య వివాహం దురాచారం

కేవీబీపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం దురాచారం అని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ చెప్పారు. మంగళవారం మండలంలోని ఆదవరం గ్రామంలో యాక్సెస్ జస్టిస్ ఫర్ చిల్డ్రన్, ప్రగతి సంస్థ సంయుక్తంగా బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాయి. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగవారికి 21సంవత్సరాలు నిండనిదే వివాహాలు జరపించకూడదని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ మల్లికార్జున, మధు, కుమార్, లత, కోఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడే పాలిసెట్

సత్యవేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించే పాలిసెట్ ఈనెల 30న బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. పాలిటెక్నిక్‌తో పాటు స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఉంటే పరీక్షా కేంద్రంలో ముందుగానే సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఏరేజర్, షార్ప్‌నర్ తీసుకురావాలని సూచించారు. బాలికల గురుకుల పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నెం.4141001 నుంచి 4141150 వరకు, పాలిటెక్నిక్ కేంద్రంలో నెం.4151001 నుంచి 4151150 వరకు కేటాయించినట్లు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి

రేణిగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఏర్పేడు రైల్వే గేటు వద్ద మంగళవారం జరిగింది. జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపిన వివరాలు... బాలకృష్ణాపురం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిపడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని, తిరుపతి వైపుకు వెళ్లే రైలు నుంచి జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్ష

సత్యవేడు, ఏప్రిల్ 29: ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్యవేడు డిపోలో ఎన్ఎంయూఏ నాయకులు చేపట్టిన రిలే దీక్ష రెండె రోజు కొనసాగింది. ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో డిపో వెలుపల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు చేతపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ నాయకుడు వెంకటయ్య, డిపో చైర్మన్ సుధాకర్, సీసీఎస్ డెలిగేట్ సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో పొరపాట్లు ఉండొద్దు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాభూపాలపురంలో జరుగుతున్న రీ సర్వేలో పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు తెలిపారు. పార్లపల్లి సచివాలయంలో మంగళవారం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే జరిగే సమయంలో పొలం దగ్గర రైతు కచ్చితంగా ఉండే విధంగా చూడాలన్నారు. సర్వే చేసిన భూమికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

కొనసాగిన గజదాడులు



రేణిగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాముండూరులో మంగళవారం తెల్లవారు జామున ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. మామిడి తోటల్లో ప్రవేశించి చెట్ల కొమ్మలను విరి చేశాయి. అలాగే చేతి బోర్లను, సోలార్ ప్యానెళ్లను, ప్లాస్టిక్ నీటి పైపులను తొక్కి ధ్వంసం చేశాయి. బాణపంచా కాల్చడంతో అడవిలోకి వెళ్లిపోయాయని తోట యజమానులు చెప్పారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులు తోటల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.